క్లుప్తంగా

శ్రీకాంత్ పరామర్శ



నరసింహమూర్తిని పరామర్శిస్తున్న శ్రీకాంత్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: పట్టణంలో ఇటీవల అస్వస్థతకు గురైన, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇద్దరిని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గురువారం పరామర్శించారు. స్థానిక గోఖిలే సెంటరులో ఇటీవల అస్వస్థతకు గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కొప్పిశెట్టి నరసింహరావును, స్థానిక దొమ్మేటివారి వీధిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మామిడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని డాక్టర్ శ్రీకాంత్ పరామర్శించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారిని డాక్టర్ శ్రీకాంత్‌తోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ దొమ్మేటి రాము, పార్టీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పరామర్శించారు.

భోజనం ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న వెంకటేశ్వరరావు

అల్లవరం: కొమరగిరిపట్నంలోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం తినేందుకు అనువైన ప్లేట్లను ట్రస్టు అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు గురువారం పంపిణీ చేశారు. ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావుని పీటీఎం పాలకవర్గ సభ్యులు తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు రమేష్‌రాజు, హెచ్ఎం నళిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులను సమర్థ వంతంగా ఎదుర్కోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

అల్లవరం: వరదలు, తుపాన్లు, ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి మండల స్థాయి అధికారులు సమాయత్తం కావాలని ఆర్డీఓ కె.మాధవి అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులతో గురువారం ఆమె సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాధవి మాట్లాడుతూ గోదావరి నదికి వరదలు వస్తున్న నేపథ్యంలో అల్లవరం మండలంలోని దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వరద హెచ్చరికలు అనుగుణంగా ముంపు బారిన పడే గ్రామాల్లో సహాయక చర్యలకు సన్నద్ధం కావాలన్నారు. ముంపు ప్రాంతాల్లో తాగునీరు సరఫరాకు విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నయంగా జనరేటర్లుని ఏర్పాటు చేసుకుని తాగునీటికి ఆటంకం లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో వసతులు, సహాయక చర్యలు, పడవలు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు సిద్ధం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు నెలల పాటు నిత్యావసరాలు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం సూచనలు, ఆదేశాలను మండల స్థాయి అధికారులు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణరావు, తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల శిబిరం

యానాం: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్ఈసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కేంద్ర సామాజిక, సాధికారిత మంత్రిత్వశాఖ నిర్వహణలో యానాం సాంఘిక సంక్షేమ శాఖతో సంయుక్తంగా శుక్రవారం వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్ఏఓ మునిస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో దివ్యాంగులకు సీఎస్ఆర్ స్కీమ్ ద్వారా కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్టు తెలిపారు.

డీటీకి కుల ధ్రువీకరణ పత్రాల జారీ అధికారం

యానాం: నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఐఅండ్‌పీసీ సర్టిఫికెట్ల జారీ చేసే అధికారాన్ని డిప్యూటీ తహసీల్దార్ కమ్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు అప్పగిస్తూ గురువారం పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ, అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి, కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి దరఖాస్తులపై పూర్తిగా విచారించి డీటీ జారీ చేస్తారని వివరాలకు సబ్ తాలూకా ఆఫీసు 0884-2325124ను సంప్రదించాలని కోరారు.

వెదజల్లుకు సమాయత్తం

- ఖరీఫ్‌లో వెదజల్లు పద్ధతిలో సాగు
- తక్కువ పెట్టుబడి..ముందుగా దిగుబడి
- ఆసక్తి చూపుతున్న రైతులు



వెదజల్లుకు ముందు చేలను పట్టిలాగుతూ చదును చేస్తున్న రైతులు



విత్తనాలు వెదజల్లుతున్న రైతు

ముమ్మిడివరం: వాతావరణం అనుకూలించక సకాలంలో నారు మడులు అందుబాటులేక రైతులు ఖరీఫ్ సాగులో పెట్టుబడులు తగ్గించుకొనే చర్యల్లో చేపట్టారు. దీనిలో భాగంగా ప్రత్యామ్నాయ పద్ధతిలో సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతినడంతో మరోసారి నారు వేసే పరిస్థితి లేక పలువురు రైతులు వెదజల్లు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ సాగు వల్ల సమయం కలిసి రావడమే కాకుండా కూలీల సమస్య తీరుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చునని రైతులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో పలువురు రైతులు వెదజల్లు విధానంలోనే సాగు చేస్తున్నారు. గత ఐదేళ్లగా వెదజల్లు సాగు చేసి అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు 48 బస్తాల వరకు దిగుబడి ఆర్జించారు. ఇప్పుడు వీరిని ఆదర్శంగా తీసుకుని అధిక శాతం రైతులు వెదజల్లు సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సమయం, నారు కొరతను అధిగమించేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా వ్యవసాయాధికారులు సూచనల మేరకు రైతులు ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో పలు గ్రామాలలో సుమారు 3 వేల ఎకరాలలో ఈ సాగు చేపట్టేందుకు సమయాత్తమవుతున్నారు.

సాగు విధానం ఇలా

కాండం గట్టిగా ఉండి పడిపోని వరి రకం విత్తనాలు సిద్ధం చేసుకోవాలి. చేలలో 15 రోజులు ముందుగా దమ్ము చేసి మురగ బెట్టాలి. విత్తనాలు జల్లే నాలుగు రోజులు ముందు మరో సారి దమ్ము చేసి పొలాన్ని చదును చేయాలి. మట్టి పేరుకున్న తరువాత ప్రతి రెండు మీటర్లకు మధ్య 12 సెంటీమీటర్లు వెడల్పున బోదులను ఏర్పాటు చేయాలి. మడికట్టి మొలకెత్తిన విత్తనాలను చేలలో కొద్దిగా నీరు ఉండి వెదజల్లాలి. వెదజల్లె చేలల్లో కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు విత్తిన 8, 10 రోజుల వ్యవధిలో ఎకరాకు బెంధియోకార్బ్ 1.25 లీటర్లు, లేదా అనిలోఫాస్ 0.5 లీటర్లు 25 కిలోల ఇసుకతో కలిపి పొలమంతా ప ల్చటి నీటిలో సమానంగా వెదజల్లి అవసరమైన మేర కు తగిన మొతాదులో భాస్వరం, పోటాష్ ఎరువులు దుక్కిలో వేసి కలియదున్నాలి. విత్తిన 15, 35, 60 రోజులకోసారి సమపాళ్లల్లో నత్రజని ఎరువులు వేయాలి. దీంతో సకాలంలో పంట చేతికొస్తుంది. కూలీల సమస్య తీరుతుంది. పెట్టుబడులు తక్కువగా ఉంటాయని, ప్రస్తుతం ఈసాగు విధానం మేలని వ్యవసాయాధికారులు అంటున్నారు. అవసరమైన సూచనలు, సలహాలు రైతులకు అందిస్తున్నామన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: ఆషాఢ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పి.మల్లవరం గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టరు ధూళిపూడి చిట్టిబాబు, పద్మశ్రీ దంపతులతో అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణ, వీరబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, పితాని విష్ణు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీని అరికట్టిన సాంకేతిక బృందం



గ్యాస్ లీకేజీని చాకచక్యంగా అరికట్టిన విషయాలను వివరిస్తున్న ఆర్డీవో మాధవి, ఓఎన్జీసీ అధికారులు

అమలాపురం టౌన్: మామిడికుదురు మండలం పాశర్లపూడి లంకలో ఓఎన్జీసీ క్షేత్రంలో పీఎస్‌సీవీ వెల్ (బావి), 200-3 నంబరు గల రిగ్‌లో డ్రిల్ చేస్తుండగా అనివార్యమైన గ్యాస్ లీకేజీని సాంకేతిక బృందం చాకచక్యంగా వ్యవహరించి అరికట్టిందని అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి అన్నారు. ఓఎన్జీసీ అధికారులతో ఆర్డీవో మాధవి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ బావి వద్ద 77 రోజులుగా డ్రిల్లింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని, బుధవారం రాత్రి 7.45 గంటలకు డ్రిల్లింగ్ చేస్తుండగా రిగ్ నుంచి మడ్‌తో కూడిన శబ్దం, గ్యాస్ లీకేజీ అంశాలపై ఆర్డీవో వివరించారు. గ్యాస్ అత్యధిక పీడనంలో పెద్ద శబ్దంతో ఎగిసిపడడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలు ఆందోళన చెందన వసం లేదని ఆమె స్పష్టం చేశారు. గ్యాస్ లీకేజీని బుధవారం రాత్రే సాంకేతిక సిబ్బంది అదుపు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఇప్పటి దాకా ఈ డ్రిల్లింగ్ పాయింట్‌లో 2,866 మీటర్ల లోతున డ్రిల్లింగ్ యాక్టవిటీ కొనసాగించారని చెప్పారు. ఇంకా 46 మీటర్ల మేర నెల రోజుల పాటు డ్రిల్లింగ్ చేయాల్సి ఉందన్నారు. చమురు సహజ వాయు నిక్షేపాలు డ్రిల్లింగ్ పాయింట్‌లో ఉన్నాయని నిర్ధారించిన పక్షంలో ఓఎన్జీసీ నిపుణుల పర్యవేక్షనలో పూర్తి భద్రతా చర్యల నడుమ తుదుపరి డ్రిల్లింగ్‌కు అనుమతించడం జరుగుతుందని ఆర్డీవో వివరించారు. ఈ సమావేశంలో ఓఎన్జీసీ జీజీఎం రఘు మీనన్‌తోపాటు సాంకేతిక బృందం సభ్యులు పాల్గొని తక్షణమే గ్యాస్ లీకేజీని అదుపు చేసిన విషయాలపై మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు పట్టణ సీఐ వీరబాబు సూచన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: విద్యార్థులు తమ తల్లిదండ్రుల స్మార్ట్ ఫోన్లు ఇంట్లో అప్పుడప్పుడు సరదాగా వాడుతున్నప్పుడు అనవరమైన యాప్‌లను అవగాహన లోపంతో ఓపెన్ చేసి సైబర్ నేరాలకు అవకాశం ఇవ్వొద్దని పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. స్థానిక శ్రీచైతన్య స్కూలులో పట్టణ పోలీసులు గురువారం పలు నేరాల నివారణకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ వీరబాబు మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి ఆ మోసాల బారిన పడొద్దని సీఐ హితవు పలికారు. రోడ్డు ప్రమాదాల నివారణలో కూడా పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లైసెన్స్ రాకుండా బైక్‌లు నడపవద్దని, అతి వేగం అనర్థమని వివరించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న వేధింపులు తదితర సమస్యలను స్వీయ రక్షణతో ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పిస్తూనే చిట్కాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణకు శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థిని డౌన్ లోడ్ చేసుకోవాలని సీఐ వీరబాబు విజ్ఞప్తి చేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యం కల్పించాలి



పీటీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో గత ప్రభుత్వ హయాంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం ఉన్నత పాఠశాల, గోడిలోని బాలురు గురుకులంలో గురువారం నిర్వహించి మోగా పీటీఎం కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. దేవగుప్తం, బోడసకుర్రు జిల్లా ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి హాజరైయ్యారు.

తాళ్లరేవు: విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికే ప్రభుత్వం మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించిందని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. తాళ్లరేవు హైస్కూల్‌లో జరుగుతున్న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమ తల్లి పేరున ఒక మొక్క నాటాలని సూచించారు.

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు జేసీ నిషాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు నాగ సత్యనారాయణతో కలిసి ఆమె మొక్కలు నాటారు. డీవైఇవో సూర్యప్రకాశం, కోఆప్షన్ సభ్యు లు స్వర్ణన్ రాజు, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం గురువారం జరిగాయి. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డులోని మౌలానా ఆజాద్ అబుల్ కలామ్ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో జరిగిన సమావేశంలో కమిషనర్ నిర్మల్‌కుమార్, వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నేతలు సంసాని బులినాని, షేక్ అబ్దుల్ ఖాదర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణిమ పూజలు

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా మందిరాలు



అమలాపురం స్వర్ణ శిఖర షిరిడి సాయిబాబా దర్శనానికి పోటెత్తిన భక్త జనం



పీఠంలో పూజలు చేస్తున్న రాఖీ ప్రేమ్, బ్రహ్మ నాగబాబు శర్మ తదితరులు



దత్తాత్రేయ షిర్డీ సాయిబాబును దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: పట్టణంలో గురు పౌర్ణిమ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. షిరిడీ సాయిబాబా మందిరాల్లో తెల్లవారు జాము నుంచి రాత్రి దాకా భక్తులు కిటకిటలాడారు. గురుపౌర్ణమ గురువారం రావడం సాయిబాబా ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు మరింత భక్తిశ్రద్ధలతో బాబాకు అభిషేకాలు చేశారు. పట్టణంలో పేరుగాంచిన స్వర్ణ శిఖర షిరిడి సాయిబాబా మందిరంలో వేలాది మంది భక్తులు బాబాను దర్శించుకున్నారు. మందిర నిర్మాణ కర్త మేడిచర్ల సాయిరామ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. సావరం, హౌసింగ్ బోర్డు కాలనీ, నారాయణపేట, సూర్యనగర్, భూపయ్య అగ్రహారం, కొంకాపల్లి, అన్నాబత్తుల వారు వీధి, కల్వకొలను వీధి, నల్లా వీధి తదితర ప్రాంతాల్లోని షిరిడి సాయిబాబా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. భూపయ్య అగ్రహారంలోని దత్తాత్రేయ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది.

అమలాపురం టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీ దత్తాత్రేయ షిరిడి సాయిబాబా మందిరాన్ని నియోజకర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గురువారం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. డాక్టర్ శ్రీకాంత్‌తోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు బాబాను దర్శించుకున్నారు. మందిర కమిటీ చైర్మన్ పేరి కొండబాబు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది డాక్టర్ శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు.

కామాక్షీ పీఠంలో గురు పూజోత్సవం

స్థానిక కామక్షీ పీఠంలో గురు పూజోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆషాఢ మాసం సందర్భంగా పౌర్ణమి మహాశాడి వ్యాస పూర్ణిమ విశేషమని శ్రీగురు పూజోత్సవాన్ని పీఠం బ్రహ్మ గోవిందవర్జుల నాగబాబు శర్మ భక్తులకు వివరించారు. పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ గురు పూజోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువులపై మనకు గల భక్తి ప్రపత్తులను చాటుకునేందుకు ఏర్పడిన మహా పర్వదినమే ఈ గురు పౌర్ణమ అని రాఖీ ప్రేమ్ వివరించారు. అనంతరం గురువుల అవాహనక్రమం వీనుల విందుగా సాగింది. చివరిగా గురు పౌర్ణమ పూజలు జరిగాయి.

ఉప్పలగుప్తం: చల్లపల్లి సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు దంపతులు సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి, పూల మాలలతో అలంకరణలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని షిర్డీసాయినాథుని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో ఉన్న శేషసాయి మందిరంలో ఆలయ ప్రతినిధి బెజవాడ మణికుమార్ ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా పూజలు చేశారు. అలాగే పిల్లంక సరిహద్దు బ్రహ్మపురిలో షిర్డీసాయిబాబా సత్సంగ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆశ్రమంలో సాయిబాబా మాస్టారు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వెంకన్నబాబు, బుచ్చిరాజు, బుజ్జి సాయి సేవకులు పాల్గొన్నారు.

సమస్యల వినతుల స్వీకరణకు కంట్రోల్ సెంటర్

మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్



మున్సిపాలిటీ 28వ వార్డులో డ్రైన్లు పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్, ఇంజినీర్లు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, పన్నుల విభాగాల్లో ప్రజలకు ఇబ్బంది ఎదురైనప్పుడు వారు ఫిర్యాదులు చేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో త్వరలోనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. స్థానిక 28వ వార్డులోని పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్ల తదితర విభాగాల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ గురువారం క్షేత్ర స్థాయి పర్యటన చేసి తెలుసుకున్నారు. నేరుగా ప్రజలతో ఆయన మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. డ్రైన్‌లో మురుగు నీరు సక్రమంగా పారని విషయాన్ని కమిషనర్ గుర్తించారు. కమాండ్ కంట్రోల్ సెంటరు ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు చాలా వరకూ పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. త్వరలోనే కమాండ్ కంట్రోలు సెంటర్ పని చేసే విధి విధానాలను వివరిస్తామన్నారు. మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈలు, వార్డు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు, వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపి రమేష్ తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో నూతనంగా నిర్మిస్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనుల కారణంగా ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, ఎర్రగరువు, జి.మూలపాలెం, కేశనకుర్రు, తిలకుప్ప, కేశనకుర్రుపాలెం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంట నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

డయేరియాపై అవగాహన

యానాం: మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం కనకాలపేట, మత్స్యకార గ్రామాల్లో మిషన్‌శక్తి సభ్యులు డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు, సంరక్షకులకు పిల్లల్లో కలిగే డయేరియా నివారణ, పరిశుభ్రత, ఓఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణవేణి, మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ రిబ్కారోస్లిన్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమం చేశారు. 114 మంది భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన వనమాడి మహేష్ (24) కాకినాడ పోర్టులో పనిచేస్తుంటాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి విధులకు హాజరయ్యేందుకు మహేష్ తన మోటార్‌సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. కరప మండలం ఉప్పలంక బ్రిడ్జి దిగుతుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఉద్యోగికి అక్కడ పనేమిటో..!



గోకనవిల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సురేఖారాణి పక్కన కూర్చున్న ఆమె భర్త ప్రభుత్వ ఉద్యోగి అజీజ్

ఉప్పలగుప్తం: అయినవిల్లి మండలం వీరవిల్లిపాలెం గ్రామంలో ఉన్న పీహెచ్‌సీలో ఎంఎస్‌ఓగా పనిచేస్తున్న ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి ఎంపీటీసీ భర్త సలాది అజీజ్ గ్రామ పరిధిలో గురువారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో పలు పాఠశాలలకు వెళ్లి ప్రోటోకాల్ హోదాలో దర్శనమిచ్చారు. వేరే మండలంలో పీహెచ్‌సీ ఉద్యోగిగా వ్యవహరిస్తున్న ఆయనకు గ్రామంలో ఉన్న పాఠశాలల్లో పని ఏముందని పలువురు చర్చించుకుంటున్నారు. విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి గోకనవిల్లి ఎంపీపీ పాఠశాలలో ఆయన వేదకపై కూర్చుని సమావేశం నడుపుతున్న ఫొటోలు సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేశాయి. ఆయన భార్య సలాది సురేఖవాణి వైఎస్సార్ సీపీలో ఎంపీటీసీగా గెలుపొంది అనంతరం టీడీపీలోకి చేరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పీహెచ్‌సీ ఉద్యోగి అజీజ్ తన భార్య ఎంపీటీసీ అని ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొని పెత్తనం చెలాయిస్తున్నాడని గ్రామంలో ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో అజీజ్ పాల్గొని స్థానిక సర్పంచుకు ప్రొటోకాల్ విషయంలో భంగం కలిగిస్తున్నారని ఆరోపణలు పలుమార్లు వెలుగులోకి వచ్చాయి. ఒక ప్రభుత్వ ఉద్యోగి తాను విధులు నిర్వర్తించాల్సిన సమయంలో అక్కడి విధులకు డుమ్మా కొడుతూ రాజకీయ నాయకుల హోదాలో పెత్తనం చేస్తుంటే ఉన్నతాధికారుల చర్యలు ఉండవా అని పలువురు చర్చించుకుంటున్నారు.

పీటీఎంలో విద్యా కమిటీ చైర్మన్ ఆగ్రహం

అమలాపురం రూరల్: వన్నె చింతలపూడి హైస్కూల్‌లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ వేదికపైకి విద్యా కమిటీ చైర్మన్‌ను పిలకుండా కూటమి నాయకులకు ప్రాధాన్యత ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ నిషాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జేసీ వేదికపైకి ఉండడంతో కేవలం టీడీపీ నాయకులు మాత్రమే ఉన్నారు. కనీసం సర్పంచులను గానీ, విద్యా కమిటీ చైర్మన్‌ను వేదికపై పిలవలేదని విద్యా కమిటీ సభ్యులు ప్రశ్నించారు.

పాలగుమ్మి మధ్యాహ్న భోజన నాణ్యత లేదు

పాలగుమ్మి ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం వేడుకల్లో మధ్యాహ్నం భోజనం బాగోలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి, ఉప సర్పంచ్ కాట్రు వసంతకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాట్రు మురళీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం బాగోలేదని వివరించారు. వెంటనే భోజనం నిర్వాహకులను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దృష్టి తీసుకువచ్చారు. అదేవిధంగా ఆహార భద్రత అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.